
# డ్యూటీ



రెండు గంటల రాత్రివేళ హాస్పటల్ ఎలా ఉంది? అమ్మడొక్కలో ముడుచుకొని పడుకొన్న పిల్లవాడిలా ఉంది. చీకటి కుండపోతగా కురుస్తున్న వానలా ఉంటే, మంచు చెమ్మగిల్లిన కంటిలోంచి జారుతున్న కన్నీటి బొట్టులా ఉంది. "ఎ.టి.ఎస్. వైల్ ఒకటి తెచ్చి పెట్టవా" అన్న మాటలకు ఉలిక్కిపడి అటు చూశాను. వాణి. నా క్లాస్‌మేట్. ఇదేమిటి ఇక్కడ ప్రత్యక్ష మయింది. "ఏమిటి మీ నర్సింగ్ హెూమ్‌లో ఎ.టి.ఎస్‌కూడా లేదా?" అన్నాను నవ్వుతూ. "కాదు. పర్సనల్ యూజ్‌కి." సన్నగా పీలగా పొరల్ని చీల్చుకు వస్తున్నట్టుగా వినిపించింది తన గొంతు. తల పైకెత్తి చూస్తే మసక వెలుతురులో తన కళ్ళ చాటున మెరుస్తున్న నీటిపొర.

"రావు ఈ రోజు మళ్ళీ కొట్టాడు. అలా చూడకు. ఎంత డాక్టర్ని అయినా అతనికి పెళ్ళాన్నే కదా! ఫేటల్‌గా ఉన్నాయి దెబ్బలు. ప్రివెంటివ్‌గా ఎ.టి.ఎస్. తీసుకుందామని. అమ్మా వాళ్ళ యింటికి వెళ్తున్నాను. నర్సింగ్ హెూమ్ తనదట. నేను రాకూడదట. వచ్చినా ఏదీ ముట్టుకోగూడదట." ఎందుకు కొట్టాడు అనే ప్రశ్నలాంటి నా చూపులకు "పెద్ద కారణ మేమీ లేదు. కొత్తగా ఒక నర్సింగ్ గర్ల్‌ను ఎప్పాయింట్ చేశాడు. అది చాలా మిస్చవస్ లేడీ. ఇద్దరూ రాసుకు పూసుకు తిరుగుతుంటే నాకు కడుపులో కెలికినట్లు ఉండేది. వాళ్ళకింత చనువు యివ్వ వద్దు నెత్తికెక్కుతారు అని ఎడ్వైజ్ చేశాను. నన్ను అనుమానిస్తావా? అయినా నా యిష్టం వచ్చిన దాన్తో... అంటూ..." వాణి ఏడుస్తుంది. ఎలా ఓదార్చాలి. ఏమని ఓదార్చాలి. ఇంజక్షన్ ఇస్తూ "ఆపాటి మొగుడనే వాడు లేకపోతే బ్రతకలేవా? అన్నాను. "బ్రతకలేక కాదు కానీ పాప మాటేమిటి?" జవాబు దొరకని ప్రశ్నలా చరచరా చీకట్లోకి వెళ్ళి పోయింది వాణి.

వాణి తాలూకు విషాదాన్ని నెమరు వేసుకుంటూ పక్కనున్న టీస్టాల్ వైపు వెళ్ళాను. టీ తాగి, చలిలో బిగుసుకు పోయిన చేతుల్ని పాంటు జేబులో దాచుకొని, వెచ్చగా ఉండటానికి లోగొంతుకలో శ్రీశ్రీ పాటలు పాడుకుంటూ హాస్పటల్‌లో అడుగు పెట్టేంతలో అక్కడ వరండా హంసల దీవిలా ఉంది. గుంపులు గుంపులుగా నర్సులు అక్కడ మూగి ఉన్నారు. క్యాజువాలిటీ వార్డు ముందు నిలబడి వార్డుబాయ్‌లు డ్యూటీ డాక్టర్లు వింతను చూస్తూ నిలబడ్డారు. "నర్సులు లైటనింగ్ స్ట్రైకొ" అన్నాడు డాక్టర్ రఘు. "పీడియాట్రిక్స్ వార్డులో కుర్ర హౌస్‌సర్జన్ ఒకడు నర్సును చితకబాదాడట. అతణ్ణి సస్పెండ్ చెయ్యమని ఈ స్ట్రైకొ" అసలేం జరిగింది అన్నాను. "ఆ హౌస్‌సర్జన్ పన్నెండింటికి నిద్ర వస్తుంది. ఎంటిరైటిస్ కేసు వాడికి సెలైన్ పెట్టమని నర్సింగ్ స్టూడెంట్‌తో చెప్పి వెళ్ళాడట. మూడింటికి వచ్చి చూస్తే సెలైన్ లేదూ పాడూలేదు. పేషెంటు డీహైడ్రేటింగ్ కండీషన్‌లో ఉన్నాట్ట. ఈ హౌస్‌సర్జన్ ఆ పిల్ల నర్సుని పిలిచి సెలైన్ ఎందుకు పెట్టలేదు అని అడిగాడట. బిజీగా ఉన్నాను. టైమ్ లేదు. అందట ఆ పిల్ల. వీడు – ఎవడితో అంటే వాడితో పడుకోడానికి టైమ్ ఉంటది, వార్డుపనికి మాత్రం ఉండదు. అన్నాడట. మర్యాదగా మాట్లాడరా! యిడియట్ అంటూ ఆ పిల్ల రిటార్టు ఇచ్చింది. దాంతో మనవాడు రెచ్చిపోయి ఆ పిల్లను ఎడా పెడా కొట్టాడట." ఆర్.ఎమ్.వో వచ్చినట్లున్నాడు. నర్సులు స్లోగన్స్ యిస్తున్నారు. 'సతీ'నామ సంవత్సరం కదా! ఇంకా ఎన్ని ఘోరాలు చూడాలో యిలాంటివి.

కబళము దొరకని బిచ్చగాడిలా నిద్రకోసం తపిస్తున్నాయి నా కళ్ళు. డ్యూటీరూమ్‌కి చేరి ఒక కుర్చీలో కూలబడిపోయాను. మెలుకువ వచ్చేసరికి రాత్రి వెళ్ళి పోవటానికి సిద్ధమై ఉంది. రిథమిక్‌గా సాగిపోయే బృందగానంలా వినిపిస్తుంది. బయట పక్షుల కలకలం. కిటికీకి బయట వ్రేలాడుతున్న మంచుపూలు వెండి రంగు పులుముకుంటున్నాయి. క్యాజువాలిటీలో అరుపులు కేకలు వినిపిస్తున్నాయి. అక్కడికి వెళ్ళేసరికి సి.ఎమ్.ఓ. పెద్దగా కోపంగా అరుస్తున్నాడు. ఒక ఇరవై యేళ్ళ అమ్మాయి నిర్భయంగా పొగరుగా అతనివైపు చూస్తుంది. "ఏమిటి నీకు సంజాయిషీ ఇచ్చేది. డ్యూటీ ఆర్థోపెడీషియన్ లేడు. ఇకరాడు. తొమ్మిదింటికి ఓ.పికి తీసుకెళ్ళండి. ఇప్పుడు మేం చెయ్యడానికేం లేదు. మీరిక వెళ్ళండి" అంటున్నాడు మా సి.ఎమ్.ఓ. "ఏంటయ్యా వెళ్ళేది. వైద్యంకోసం ప్రాణాలరచేతుల్లో పెట్టుకొని మైళ్ళదూరం నుంచి వస్తే వాడులేడు, వీడులేడు అని కసుర్తారు. ఇది గవర్నమెంటు ఆసుపత్రా? మీ సొంత దివాణమా?" ఆ పిల్ల దబాయిస్తుంది. "నోరు మూసుకువెళ్ళవే! డర్టీబిచ్! జోసఫ్ వీళ్ళను బయటకు లాగెయి" సి.ఎమ్.ఓ మాటలు పూర్తికాకముందే అతని చెంప చెళ్ళుమంది. "యూఆర్ టాకింగ్ లైక్ ఎ పిగ్! నీలాంటి వెధవలందర్నీ ప్రజలు నడిరోడ్డుపై చెప్పు తీసుకుకొట్టే రోజు వస్తుంది." ఆ అమ్మాయి ఉగ్రంగా, భయంకరంగా, గర్జించి ముసలి తల్లిని నడిపించుకొని బయటకు వెళ్ళిపోయింది. ఆ అమ్మాయితో పాటే మిగిలిన కొద్దిపాటి చీకటి వెళ్ళిపోయింది. ఉదయం వచ్చేసింది.

నా నైట్ డ్యూటీ ముగిసింది. కానీ ఇంకా ఎన్నెన్ని రాత్రులు శవంలా నిర్జీవంగా భయం కలిగించేవి రానున్నవో?

• ఆంధ్రజ్యోతి, అక్టోబర్ 1988 •